సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 26 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.34,100
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.34,100, కనిష్టంగా రూ.14 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.36
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.36, కనిష్టంగా రూ.20, సరాసరిన రూ.28 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
30.2°/14.8°
జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రాత్రి కరెంటుపై రగడ

- మంత్రి సవితను నిలదీసిన రైతులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే నాణ్యమైన విద్యుత్ అందేదని వెల్లడి
- సమాధానం చెప్పలేక అధికారులపై తోసేసిన మంత్రి



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సవిత

పరిగి: ''వ్యవసాయానికి రాత్రి పూటే కరెంటు ఇస్తున్నారు. అది కూడా సరిగా ఇవ్వడం లేదు. ఇలా ఉంటే మేము పంటలు ఎలా పండించుకోవాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అయితే పగటి సమయంలోనే నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేవారు. అదికూడా 9 గంటలు నిరంతరాయంగా అందించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.. రైతు సంక్షేమ ప్రభుత్వం అంటే ఇదేనా'' అంటూ మండలంలోని పలు గ్రామాల రైతులు మంత్రి సవితను నిలదీశారు. సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళీ శాఖ మంత్రి సవిత అధ్యక్షతన పరిగిలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. వాస్తవానికి ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం మంత్రి సవిత రాక ఆలస్యం కావడంతో మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమైంది. దీంతో చాలా మంది వెనుదిరిగివెళ్లిపోయారు. ఆ తర్వాత మంత్రి వేదిక వద్దకు రాగానే రైతులు విద్యుత్ సమస్యపై ఆమెను నిలదీశారు. దీంతో ఏం చెప్పాలో తెలియని మంత్రి... అక్కడే ఉన్న విద్యుత్ అధికారులను సమాధానం చెప్పడంటూ గదమాయించారు. దీంతో ప్రభుత్వ పాలసీ అలా ఉంటే మేమేం చెప్పేదంటూ వారు నీళ్లు నమిలారు.

అధికారులపై మంత్రి ఆగ్రహం
పరిగి మండలంలో కొన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అందరూ కష్టపడి పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం ఆమె పైడేటి వద్ద దాదాపు రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దారు హసీనా సుల్తానా, ఎంపీడీఓ శ్రీధర్, ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, ఏఓ విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

వాగులోని ఇసుకకూ అనుమతి తప్పనిసరి

హిందూపురం అర్బన్: స్థానికులు ఎవరైనా సరే తమ అవసరాలకు సమీపంలోని వాగులు, వంకల నుంచి ఇసుక తీసుకువెళ్లాలన్నా ఆన్‌లైన్ ద్వారా అనుమతి పొందాల్సిందే. ఈ మేరకు జిల్లా భూగర్భ జల వనరుల శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి స్థానిక అవసరాలకు ప్రభుత్వం అనుమతించిన వాగులు, వంకలు నుంచి ఇసుక తరలించాలంటే తప్పనిసరిగా ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టం వెబ్ సైట్‌లోకి వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇసుక కావాల్సిన వారు ఇంటి నంబర్, గ్రామం, మండలం, జిల్లా, సంబంధిత సచివాలయం తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇదంతా నమోదు చేసిన తర్వాత తగిన రసీదు తీసుకొని దగ్గర ఉంచుకుని ఇసుక రవాణా చేసుకోవాలి. ఈ ప్రక్రియ ఇసుక రవాణా చేసేందుకు 24 గంటల ముందే చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా ఇసుక వాహనం రోడ్డు పైకి వస్తే దాన్ని అక్రమ రవాణాగా గుర్తించి సీజ్ చేసేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి టౌన్: డీఆర్‌డీఏ – సీడాప్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. సీ–డాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి సహకారంతో జిల్లాలోని నిరుద్యోగ యువతకు టెలీకాం సెక్టార్‌లో ఫీల్డ్ మేనేజ్మెంట్ ఇంజినీర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ కోర్స్‌లపై ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు వెలుగు ఏపీఎం లక్ష్మీనారాయణ, జాబ్ కోఆర్డినేటర్ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఇంటర్, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసిన వారు, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు భోజన వసతి కల్పించి మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు సైతం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 28 తేదీలోపు పుట్టపర్తి పట్టణంలోని ఈశ్వరమ్మ మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు 9640899337 నంబరులో సంప్రదించాలన్నారు.

కార్తీకం... దేదీప్యమానం

కార్తీకంలో వచ్చిన చివరి సోమవారం శైవ క్షేత్రాలన్నీ భక్తులతో పోటెత్తాయి. ఓంకార నాదంతో ప్రతిధ్వనించాయి. కార్తీక దీపాలతో కాంతులీనాయి. పుట్టపర్తి, కదిరి, హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, మడకశిర తదితర ప్రాంతాల్లో భక్తులు తెల్లవారు జామున నుంచే ఆలయాల ఎదుట బారులు తీరి పార్వతీపతికి పూజలు చేశారు. సాయంత్రం వేళ మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షి బృందం, శ్రీసత్యసాయి జిల్లా



హిందూపురం శివాలయంలో మూలవిరాట్



పూజలందుకుంటున్న మేళాపురం శివయ్య



హిందూపురం త్యాగరాజనగర్ ఆలయంలో లక్షదీపోత్సవం నిర్వహిస్తున్న మహిళలు



పరిగి మండలం సుబ్బరాయునిపల్లిలో శివలింగాకారంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



హిందూపురం త్యాగరాజనగర్ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న దృశ్యం



బత్తలపల్లి మండలం పోట్లమర్రిలో కార్తీక దీపారాధన

పట్టించుకోక.. పనులు సాగక!



ఇది పెనుకొండ అర్బన్ కాలనీలోని సచివాలయ భవనం. ఈ భవన నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 40 లక్షలు మంజూరయ్యాయి. అయితే అరకొర బిల్లులు అందుకున్న కాంట్రాక్టర్..ఆ తర్వాత పనులు నిలిపివేశాడు. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో భవన నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు.

...ఇలా ఒకటి కాదు, రెండు కాదు జిల్లాలోని 649 ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టడం లేదు. ఫలితంగా ప్రజలకు సేవలందడం లేదు. మరోవైపు సౌకర్యాలు లేని భవనాల్లో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

- అర్ధంతరంగా ఆగిన ప్రభుత్వ భవన నిర్మాణాలు
- అసంపూర్తిగా సచివాలయ, ఆర్బీకే, విలేజ్ క్లినిక్ భవనాలు
- 1,102 భవనాలు మంజూరు కాగా, 453 మాత్రమే పూర్తి
- నేటికీ అసంపూర్తిగా 649 భవనాలు
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులున్నా.. పట్టించుకోని అధికారులు
- ప్రజలకు సకాలంలో అందని సేవలు



ఇది పెనుకొండ అర్బన్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్. ఈ భవనానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20.80 లక్షలు మంజూరయ్యాయి. కానీ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. అధికారుల పర్యవేక్షణ లోపం... కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి హెల్త్ సెంటర్ విష సర్పాలకు నిలయంగా మారింది.

పెనుకొండ: మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని తీసుకువచ్చేందుకు వైఎస్ జగన్ సర్కార్ గ్రామగ్రామానా సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ప్రజలకు ముంగిళ్లలోనే సేవలందించేందుకు ఆయా కార్యాలయాలకు సొంత భవన నిర్మాణాలకు నిధులు కూడా మంజూరు చేసింది. ఫలితంగా ఉద్యోగులకు సౌకర్యాలు సమకూరి సేవలు వేగవంతమవుతాయని భావించింది. అయితే అధికారుల పర్యవేక్షణ లోపం...కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో భవన నిర్మాణాల పనులు ముందుకు సాగడం లేదు. కూటమి ప్రభుత్వం ఈ భవన నిర్మాణాలను పూర్తిగా విస్మరించడంతో భవనాలన్నీ అర్ధంతరంగా ఆగిపోయాయి.

అందని సేవలు.. ఇబ్బందుల్లో ఉద్యోగులు
గత వైఎస్ జగన్ సర్కార్ జిల్లాలో 1,102 సచివాలయ, రైతు భరోసా, విలేజ్ క్లినిక్ భవనాల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నిధులూ మంజూరు చేసింది. కానీ అధికారుల పర్యవేక్షణ కరువు కావడంతో భవన నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. చేసిన పనుల వరకూ బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్లు ఆ తర్వాత వివిధ కారణాలు చెబుతూ పనులు వాయిదా వేస్తూ వచ్చారు. తాజాగా ప్రభుత్వం మారడంతో బిల్లులు అవుతాయోలేదోనన్న సందేహంతో చాలా మంది భవన నిర్మాణాలు నిలిపివేశారు. దీంతో ఉద్యోగులు కనీస సౌకర్యాలు లేని అద్దె భవనాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్ని అద్దె భవనాలకు కనీసం మరుగుదొడ్డి సౌకర్యం కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలకు అందని సేవలు..
వైఎస్ జగన్ హయాంలో గ్రామీణులకు పూర్తిస్థాయిలో సేవలందించిన సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఇప్పుడు ఉనికి కోల్పోతున్నాయి. రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం సచివాలయాల ద్వారా అందించే సేవలను తగ్గించడం, విలేజ్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలనూ నామమాత్రంగా నిర్వహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు ఉద్యోగులు, సేవల కోసం వచ్చే ప్రజలతో కళకళాడిన కార్యాలయాలన్నీ నేడు వెలవెలబోతున్నాయి. ఇక ఎవరైనా బదిలీపై వెళ్తే సదరు ఉద్యోగి స్థానంలో మరొకరిని నియమించకపోవడంతో ప్రజలు అటువైపు వెళ్లడం మానేశారు. ప్రస్తుతం ఏ సర్టిఫికెట్ కావాలన్నా వ్యయప్రయాసలకోర్చి మండల కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

నిరుపయోగంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు..
సచివాలయ భవనాలకు అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను వినియోగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి ఇంజినీరింగ్, మండల పరిషత్ అధికారులకు పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పజెప్పింది. అయితే వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆ నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. అరకొర పనులు చేసిన కాంట్రాక్టర్లు అనంతరం భవన నిర్మాణాల గురించి పట్టించుకోలేదు. ఫలితంగా ప్రజలకు సేవలు సకాలంలో అందని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో ప్రభుత్వ భవన నిర్మాణాల పరిస్థితి ఇలా...				
	భవనాలు	పూర్తయినవి	పెండింగ్	ఒక్కో భవనానికి నిధులు
సచివాలయాలు	420	187	233	రూ.40 లక్షలు
ఆర్బీకేలు..	389	169	220	రూ.21.50 లక్షలు
విలేజ్ క్లినిక్‌లు	293	97	196	రూ. 20.80 లక్షలు

భవన నిర్మాణాలు పూర్తి చేయాలి



గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టింది. రూ.వందల కోట్లతో భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలా భవనాలు అందుబాటులోకి రాలేదు. ప్రభుత్వం ఆయా ప్రభుత్వ భవన నిర్మాణాలపై దృష్టి సారించి వెంటనే పూర్తి చేయాలి. తద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

– సూర్యప్రకాష్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు, పెనుకొండ మండలం

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం



ప్రభుత్వ భవన నిర్మాణ పనులకు గత ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు వాడుకోవాలని చెప్పింది. అందువల్ల వాటి పూర్తి బాధ్యత ఆయా మండలాల ఎంపీడీఓలదే. దీనిపై ఇప్పటికే ఎంపీడీఓలు, సచివాలయ ఇంజినీరింగ్ అధికారులతో చర్చించాం. అయినా ఆశించిన స్థాయిలో పనులు జరగలేదు. మరోసారి ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం.

– మురళీధర్, ఈఈ, పంచాయతీ రాజ్, పెనుకొండ డివిజన్

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

- ప్రతి అర్జీకి సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలి
- అధికారులతో కలెక్టర్ టీఎస్ చేతన్



పింఛన్ తొలగించారని కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగుల వద్దకే వచ్చి ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రశాంతి నిలయం: ''కలెక్టరేట్‌లో అయితే సమస్య పరిష్కారం అవుతుందన్న నమ్మకంతో ఎంతో దూరం నుంచి వ్యయ ప్రయాసల కోర్చి ఇక్కడి వరకూ వస్తున్నారు. ఎంత సమయమైనా వేచి చూసి తమ సమస్యను అర్జీల రూపంలో ఇస్తున్నారు. వారి నమ్మకాన్ని వమ్ముకానివ్వకండి. ప్రతి అర్జీకి సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపండి. సమస్యల పరిష్కారంలో అలసత్వం వీడండి. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే కఠినంగా వ్యవహరిస్తాం'' అని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలపై 215 అర్జీలు అందగా...వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అధికారులు ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సరైన పరిష్కారం చూపేందుకు ప్రయత్నించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర, ప్రత్యుత్తరాలన్నీ ఇక నుంచి ఈ–ఆఫీస్ ద్వారానే జరగాలని, తద్వారా పనులు వేగవంతమవుతాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారథి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావు, పౌరసరఫరాల శాఖ మేనేజర్ అశ్వర్థ నాయక్, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు
ఫీజులు చెల్లించలేదన్న కారణంతో విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకపోయినా, తరగతులకు వెళ్లకుండా అడ్డుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఫీజులు చెల్లించలేదన్న కారణంతో ఇబ్బంది పెడుతున్నట్లు తెలిసిందన్నారు. ఇప్పటికైనా వారు పద్ధతి మార్చుకోవాలన్నారు. ఫీజుల విషయంలో ఇప్పటికే ప్రభుత్వం జీఓ నం 87 జారీ చేసిందని, అందులో ఫీజుల చెల్లింపులపై స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయన్నారు.

పెట్రోల్ బాటిల్‌తో కలెక్టరేట్‌కు...
కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు ఓ వ్యక్తి పెట్రోల్ బాటిల్‌తో రావడం కలకలం రేపింది. గోరంట్ల మండలం మల్లాపల్లికి చెందిన చెన్నప్ప పెట్రోల్ బాటిల్‌తో కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో పాల్గొనేందుకు వచ్చాడు. అయితే ప్రవేశద్వారం వద్ద ఆయన్ను పోలీసులు తనిఖీ చేశారు. సంచిలోని పెట్రోల్ బాటిల్ కనిపించడంతో వెంటనే అదుపులోకి తీసుకుని విచారించారు. తాను రైతునని, భూ సమస్యను అధికారులు పరిష్కరించడం లేదని తెలపడంతో అతన్ని నేరుగా కలెక్టర్ వద్దకు తీసుకువెళ్లారు. కలెక్టర్ టీఎస్ చేతన్ ఆరా తీయగా... తనకు మల్లాపల్లి పంచాయతీలో పొలం ఉందని, తహసీల్దార్ పాసుపుస్తకం ఇవ్వడం లేదని వాపోయాడు. స్పందించిన కలెక్టర్ చేతన్... వెంటనే చెన్నప్ప సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మద్యం దుకాణాల్లో విస్తృత తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

హిందూపురం: ఎక్సైజ్ అధికారులు సోమవారం మద్యం దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. హిందూపురం ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య ఆధ్వర్యంలో పలు దుకాణాలను తనిఖీ చేశారు. 'ఎనీ టైం మద్యం' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ స్పందించారు. ఆయన ఆదేశాలతో ఎక్సైజ్ అధికారులు నియోజకవర్గంలో పలు మద్యం షాపుల్లో రోజు వారి అమ్మకాలపై తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. నిబంధనలు పక్కగా అమలు చేయాలని దుకాణ యజమానులకు సూచించారు. ముఖ్యంగా బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేయకూడదని, అధిక ధరలకు మద్యం విక్రయించకూడదన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.



మద్యం షాపులో స్టాక్ వివరాలు, అమ్మకాలపై విచారిస్తున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య

పలుచోట్ల దాడులు..
అక్రమ మద్యం అమ్మకాలపై హిందూపురం ఎక్సైజ్ అధికారులు సోమవారం పలుచోట్ల దాడులు నిర్వహించారు. హోన్నంపల్లిలో కురుబ నారాయణప్ప, కల్లూరులో మూర్తి, అశోక్ అలాగే నక్కలపల్లి శీనప్పలను అరెస్టుచేసి మూడు కేసులు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. వారి నుంచి ద్విచక్ర వాహనంతోపాటు 176 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

లింగ వివక్షపై పోరాడదాం

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంత నిలయం: లింగ వివక్షకు వ్యతిరేకంగా అందరం సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జెండర్ ఆధారిత హింస వ్యతిరేక పోరాటంపై రూపొందించిన ప్రచార వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజల్లో లింగ వివక్షపై అవగాహన పెంపొందించేందుకు చేపట్టిన జాతీయ ప్రచార కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలతో పాటు ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగ దినోత్సవంపై విస్తృత ప్రచారం
రాజ్యాంగ దినోత్సవం (నవంబర్ 26) సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్ అధికారుల చుర్గ్గా పాల్గొని సంవిధాన్ దివస్(రాజ్యాంగ దినోత్సవం) గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రచార కార్యక్రమాల్లో రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలు, సూత్రాలను ప్రజలకు వివరించి చైతన్యం చేయాలన్నారు. క్విజ్ కార్యక్రమాలు ద్వారా పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ చేతన్ తదితరులు

ఎంఎస్ఎంఈ సర్వే పక్కాగా చేయాలి..
సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వే కార్యక్రమాన్ని జిల్లాలో ఈ నెల 29 నుంచి ప్రారంభిస్తున్నామని, సంబంధిత శాఖ ఉద్యోగులు పరిశ్రమల వివరాలను పక్కాగా యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ సర్వే ప్రయోజనాలు, వ్యాపార, సేవా కార్యక్రమాల వివరాలతో కూడిన ప్రచార కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్థాపించిన సాధారణ వ్యాపార సంస్థలనూ సర్వే చేయాలన్నారు.

వెంటాడిన పాపం

- 26 ఏళ్ల క్రితం ఆరు నెలల పసిబిడ్డను హతమార్చిన తండ్రి
- అప్పటి నుంచి అజ్ఞాతంలోనే నిందితుడు
- పేరు మార్చుకుని కర్ణాటకలో తలదాచుకున్న వైనం
- నిందితుడి ఆచూకీ బయటపెట్టిన పెళ్లి కార్డు
- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త చివరకు కన్నకొడుకును హతమార్చి అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఒకటి.. రెండేళ్లు కాదు.. ఏకంగా 26 ఏళ్ల తర్వాత చేసిన పాపం పండింది. పేరు మార్చుకుని కర్ణాటకలో తలదాచుకున్న నిందితుడి ఆచూకీని పోలీసులు పసిగట్టి సోమవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్న వెల్లడించారు.

ఏం జరిగింది?

శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామానికి చెందిన గొల్ల తిప్పేస్వామికి అదే గ్రామంలో నివాసముంటున్న మేనత్త పల్లెమ్మ కుమార్తె కరియమ్మతో 30 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. 1998 ఏప్రిల్‌లో జన్మించిన రెండో కుమారుడికి శివలింగమయ్య అనే పేరు పెట్టి పెంచుకోసాగారు. ఈ క్రమంలో కరియమ్మ ప్రవర్తనపై తిప్పేస్వామికి అనుమానం మొదలైంది. రెండో కుమారుడు తనకు పుట్టలేదని, ఎలాగైనా ఆ పసివాడిని మట్టుబెట్టాలని అనుకున్నాడు. 1998 అక్టోబర్ 2న దసరా పండుగ సందర్భంగా ఉదయం కులాచారం మేరకు ఆరు నెలల పసికందును కరియమ్మ ఎత్తుకుని మారెమ్మ జమ్మి చెట్టు వద్ద ప్రదక్షిణలు చేస్తున్న సమయంలో తిప్పేస్వామి బలవంతంగా లాక్కొని పక్కనే ఉన్న మామిడి తోటలోకి తీసుకెళ్లి గొంతు పిసికి చంపేశాడు. అక్కడే గొయ్యి తీసి పాతిపెట్టి పారిపోయాడు. ఘటనపై కరియమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పేరు మార్చుకుని.. పెళ్లి చేసుకుని..

పోలీసుల కళ్లుగప్పి తప్పించుకుపోయిన తిప్పేస్వామి కర్ణాటకలోని హసన్ జిల్లా న్యామనహళ్లిలో స్థిరపడ్డాడు. తన పేరును కృష్ణగౌడ్‌గా మార్చుకుని రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా, ఇటీవల తన పెద్ద కుమార్తె పెళ్లి కుదరడంతో ఆహ్వాన పత్రికను దిన్నేహట్టిలోని తన స్నేహితుడు నాగరాజుకు తిప్పేస్వామి అలియాస్ కృష్ణగౌడ్ పంపాడు. ఎస్పీ రత్న ఆదేశాలతో పాత కేసుల దర్యాప్తు చేపట్టిన పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు.. విచారణలో భాగంగా కొన్ని రోజుల క్రితం దిన్నేహట్టి గ్రామానికి వెళ్లి తిప్పేస్వామి గురించి ఆరా తీశారు. ఆ సమయంలో నాగరాజు ఇంట్లో తిప్పేస్వామి కుమార్తె వివాహ ఆహ్వాన పత్రిక లభ్యమైంది. దీని ఆధారంగా తిప్పేస్వామి ఆచూకీని పోలీసులు గుర్తించారు.

పట్టుబడ్డాడు ఇలా...

తిప్పేస్వామి ఆచూకీని పసిగట్టిన తర్వాత న్యామనహళ్లికి వెళ్లి అరెస్ట్ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. అయితే..తన తమ్ముడు చిత్తప్పతో భూమి భాగ పరిష్కారం కోసం స్వగ్రామానికి వచ్చిన తిప్పేస్వామి సోమవారం ఉదయం పెద్ద మనుషుల కోసం మందలపల్లి బస్టాండ్ వద్ద వేచి ఉండగా సీఐ రాజ్‌కుమార్ గుర్తించి అదుపులోకి తీసుకుని ఎస్పీ ఎదుట హాజరుపరిచారు. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయడంతో చేసిన నేరాన్ని అంగీకరించాడు. 26 ఏళ్లుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ మునిప్రతాప్, కానిస్టేబుళ్లు మల్లికార్జున, పోతన్న, నరేష్ మహమ్మద్‌రఫీ, హరికృష్ణను ఎస్పీ రత్న అభినందించి, రివార్డులు అందజేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీబీఆర్ నిర్వాసితులకు పరిహారం అందించండి



నిర్వాసిత రైతుల తరఫున కలెక్టర్ చేతన్‌తో మాట్లాడుతున్న రైతు విజయభాస్కర్‌రెడ్డి

పుట్టపర్తి: నిర్మాణంలో ఉన్న జిల్లేడుబండ రిజర్వాయర్ (జీబీఆర్) ముంపు బాధితులకు పరిహారం అందించాలని కలెక్టర్ చేతన్‌కు రామసాగరం గ్రామ రైతులు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను నిర్వాసిత రైతుల తరఫున పాముదుర్తి విజయభాస్కర్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే ముదిగుబ్బ, బుక్కపట్నం మండలాల్లోని సర్వే నంబర్ 283, 278, 280, 281లోని 32 మంది రైతులకు సంబంధించిన పట్టా భూములు ముంపునకు గురవుతాయన్నారు. నిర్వాసిత రైతులకు పరిహారం అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీకి సిద్ధం కాగా, ఎన్నికల కోడ్ రావడంతో ఈ ప్రక్రియ కాస్త ఆగిపోయిందన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం స్పందించి నోటిఫికేషన్ జారీ చేసి నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిపై దాడి



గాయపడిన ముక్తం ఈశ్వరయ్య

ధర్మవరం అర్బన్: భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ముక్తం ఈశ్వరయ్యపై దాడి జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలో నూతనంగా ఏర్పాటైన బేల్దారి సంఘం అధ్యక్షుడు కత్తె నాగరాజు, ప్రశాంత్, రఘు, లక్ష్మణ్, ముక్తం ఈశ్వరయ్య సోమవారం దుర్గమ్మ ఆలయం సమీపంలో సంఘం పుస్తకాలు, రికార్డుల నిర్వహణ విషయంగా గొడవపడ్డారు. వాగ్వాదం చేసుకుంటూ చివరకు ఈశ్వరయ్యపై దాడి చేశారు. ఘటనలో ఈశ్వరయ్య చెవికి తీవ్ర గాయాలయ్యాయి. ఈశ్వరయ్య అనుచరుల దాడిలో ప్రశాంత్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఇరువురి పరస్పర ఫిర్యాదుల మేరకు వన్‌టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.

కుమారుడికి పెళ్లి కాలేదని తల్లి ఆత్మహత్య



మృతురాలు భాగ్యమ్మ

రొళ్ల: కుమారుడికి పెళ్లి కాలేదన్న దిగులుతో తల్లి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం శివబాలయోగినగరం గ్రామానికి చెందిన భాగ్యమ్మ (50), పుట్టతిమ్మప్ప దంపతులు తమ ఏకైక కుమారుడు కాంతరాజుతో కలసి వ్యవసాయ పనులతో పాటు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కుమారుడికి పెళ్లి ప్రయత్నాలు చేపట్టారు. అయితే పెళ్లి సంబంధాలు ఏవీ కుదరలేదు. వయస్సు మీద పడడంతో ఇక తమ కుమారుడికి పెళ్లి కాదన్న బెంగతో కుంగిపోయిన భాగ్యమ్మ ఆదివారం రాత్రి గన్నేరు చెట్టు ఆకులను మిక్సీ పట్టి రసం తీసి తాగింది. విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే రొళ్ల పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్ణాటకలోని తుమకూరులో ఉన్న ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక సోమవారం తెల్లవారుజామున భాగ్యమ్మ మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి ఉత్సవాలు





పూజలు అందుకున్న చౌడేశ్వరి అమ్మవారు, జ్యోతుల ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో ఆదివారం ప్రారంభమైన చౌడేశ్వరిదేవి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆలయ ధర్మకర్త పాటిల్ భువనేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాటిల్ ప్రకాష్‌రెడ్డి, పాటిల్ కపిల్‌నాథరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము 5 గంటలకే ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జ్యోతుల ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుడ్డంపల్లి, బంగారంపేట, చిల్లకొండయ్యపల్లి, మోదుగులకుంట, తాడిమర్రి, మరవపల్లి, మద్దులచెర్వు, శివంపల్లి తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. గుడికట్టుదారులు అమ్మవారికి బోనాలు సమర్పించిన అనంతరం జంతు బలిదానంతో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కంచెం మురళీమోహన్‌రెడ్డి, అశ్వత్థరెడ్డి, సౌరెడ్డి, సర్పంచ్ శ్రీరాములు, మాజీ సర్పంచులు వెంకట, వరద తదితరులు పాల్గొన్నారు.

1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం



ముగ్గులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మంజువాణి

పుట్టపర్తి అర్బన్: హెచ్ఐవీ ఇన్‌ఫెక్షన్లపై ప్రజలను చైతన్య పరుస్తూ ఏటా డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. ఈ క్రమంలో ఈ ఏడాది నిర్వహించబోయే కార్యక్రమానికి సంబంధించి సోమవారం స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో ఆమె సమీక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వివిధ ప్రాంతాల్లో హైరిస్క్ గ్రూపు, హెచ్ఐవీ బాధితులతో రంగోళి పోటీలను నిర్వహించారు. వాటిని వైద్యాధికారులు పరిశీలించి ప్రత్యేకమైన ముగ్గులను ఎంపిక చేసి జాబితా రూపొందించారు. వీరందరికీ డిసెంబర్ 1న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీల్లో వేసిన ముగ్గులను డీఎంహెచ్ఓ పరిశీలించారు. జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ తిప్పయ్య, ప్రోగ్రాం అధికారి భాస్కర్, డాక్టర్ గాయత్రి, టీబీ యూనిట్ ఇన్‌ఛార్జి నాగేంద్ర, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు బలరాం, ఆంజనేయులు, విహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌టేకే కొంప ముంచింది!

అనంతపురం సెంట్రల్: గార్లదిన్నె మండలం తలగాచిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి గల కారణాలపై రవాణాశాఖ, పోలీసు అధికారులు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నారు. ప్రమాదానికి దారి తీసిన కారణాలపై లోతుగా ఆరా తీస్తున్నారు. మరో వైపు ఆర్టీఏ అధికారులు ఇప్పటికే నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిసింది. ఆటోడ్రైవర్ యూటర్న్ తీసుకుంటుండగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ గమనించలేదని తెలుస్తోంది. గార్లదిన్నె మండల కేంద్రంలోకి రాకపోకలు సాగించే వాహనాలు, తలగాచిపల్లి, తిమ్మంపేట గ్రామాలకు వెళ్లే వాహనాలకు అనువుగా అక్కడ జంక్షన్ ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో అతివేగంగా వాహనాలు వెళ్లకుండా స్పీడ్‌బ్రేకర్లు కూడా ఉన్నాయి. అయినప్పటికీ ప్రమాదం జరగడం చూస్తే ఇందుకు ప్రధాన కారణం కూడలి ప్రాంతంలో ఓవర్‌టేక్ చేయడమేనని తెలిసింది. దీనికి తోడు జంక్షన్ ప్రాంతంలో లారీని కుడి వైపు నుంచి కాకుండా ఎడమ వైపు నుంచి ఓవర్ టేక్ చేసినట్లు సమాచారం. ఓవర్‌టేక్ చేయకపోయినా, స్పీడ్ బ్రేకర్ వద్ద బస్సు వేగం తగ్గినా కూలీలు సురక్షితంగా బయటపడేవారు. కాగా, గతంలో జేఎన్‌టీయూ వీసీ సైతం ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం గమనార్హం. ఈ రహదారిలో ప్రమాదం జరిగిందంటే గాయాలతో బయటపడే పరిస్థితి లేదు.

దిద్దుబాటు చర్యలు..

తలగాచిపల్లి క్రాస్ వద్ద ప్రమాదం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో దిద్దుబాటు చర్యలకు పోలీసు, రవాణాశాఖ యంత్రాంగం ఉపక్రమించింది. పరిమితికి మించి వాహనదారులను తరలిస్తున్న ఆటోలను ఎక్కడికక్కడ సీజ్ చేసి పోలీసుస్టేషన్లకు తరలిస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా నష్టం జరిగి తర్వాత అధికారులు రోడ్లపైకి వస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జగన్‌తోనే కురుబల ఆత్మగౌరవం పదిలం

- మాజీ మంత్రి మాలగుండ్ల, మాజీ ఎంపీ గోరంట్ల



భక్త కనకదాస పూజలో పాల్గొన్న మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ ఎంపీ గోరంట్లమాధవ్, తదితరులు

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో కురుబల ఆత్మగౌరవం పదిలంగా ఉంటూ వచ్చిందని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భక్త కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించి కురుబలు తలెత్తుకునేలా చేశారని మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లిలో సోమవారం నిర్వహించిన భక్త కనకదాస జయంతి వేడుకలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. భక్త కనకదాస విగ్రహానికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం శంకరనారాయణ మాట్లాడుతూ... తాను మంత్రిగా ఉన్న సమయంలో భక్త కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలన్న విజ్ఞప్తి మేరకు అప్పటి సీఎం వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించి వెంటనే జీఓ విడుదల చేశారని గుర్తు చేశారు. సమాజంలో మార్పుకోసం కృషి చేసిన మహనీయుడు కనకదాస జీవిత చరిత్ర చూస్తే విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలనేది కనకదాస ఆశయమన్నారు. ఆనాడే ఉన్నత చదువులు అభ్యసించి సమాజాన్ని అన్ని కోణాల్లో అధ్యయనం చేసిన కనకదాస.. కుల వివక్షతకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేశారన్నారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ... భక్త కనకదాస మార్గం అందరికీ ఆచరణయోగ్యమన్నారు. ఐక్యమత్యంతోనే కురుబలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారన్నారు. అనంతరం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో గొరవయ్యలకు పాలు పోసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ననసకోట ముత్యాలమ్మ ఆలయ మాజీ చైర్మన్ ముత్యాలు, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షుడు బిల్లే నరేంద్ర, జిల్లా కార్యదర్శి వెంకటాపురం మురళి, ఎంపీటీసీ రుక్మిణమ్మ, కురుబ సంఘం నాయకులు పసుపుల ఆది, నరసింహగౌడ్, రాజహంస శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బలవంతంగా పెళ్లి చేయాలనుకుంటున్నారు

- అవ్వతాతలపై మనవరాలి ఫిర్యాదు
- సర్టిఫికెట్లు ఇప్పించాలని ఎస్పీకి వినతి



ఎస్పీ రత్నతో మాట్లాడుతున్న విద్యార్థి సాయి

పుట్టపర్తి టౌన్: అవ్వతాత చేస్తున్న బలవంతపు పెళ్లి ప్రయత్నాల నుంచి తనను కాపాడి ఉన్నత చదువులు అభ్యసించేలా చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ రత్న వద్ద ఓ విద్యార్థిని మొరపెట్టుకుంది. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్య వేదికలో ఎస్పీని కనగానపల్లికి చెందిన విద్యార్థిని సాయి కలసి వినతి పత్రాన్ని అందజేసింది. బాధితురాలు తెలిపిన మేరకు... కనగానపల్లికి చెందిన చెన్నప్పకు ముగ్గురు కుమార్తెలున్నారు. తండ్రి అవిటివాడు కావడంతో తాత పాపన్న, అవ్వ వెంకటలక్ష్మి, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో అక్కచెల్లెళ్లు చదువులు కొనసాగించారు. పదో తరగతిలో ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించిన సాయి... ఇంటర్‌లో 950 మార్కులతో టాపర్‌గా నిలిచింది. డిగ్రీ కళాశాలలో చేరాలని అనుకుంటుండగా అవ్వ, తాత, ఇతర కుటుంబసభ్యులు తన సర్టిఫికెట్లు లాక్కొని బలవంతంగా బంధువుల అబ్బాయితో పెళ్లి ప్రయత్నాలు మొదలు పెట్టారు. తల్లిదండ్రులు సైతం ఏమి చేయలేని అసహాయ స్థితిలో ఉన్నారు. సర్టిఫికెట్లు ఇప్పించి తన విద్యాభ్యాసానికి మార్గం సుగమమం చేయడంతో పాటు తన కుటుంబానికి రక్షణ కల్పించాలంటూ ఎస్పీని బాధితురాలు వేడుకుంది. స్పందించిన ఎస్పీ తక్షణమే సంబంధిత పీఎస్ సీఐతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆదేశించారు. కాగా, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 38 వినతులు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వయిజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారులో మంటలు



మంటలు ఆర్పుతున్న దృశ్యం

అనంతపురం: జిల్లా కేంద్రంలోని రాంనగర్ అంబేడ్కర్ బ్రిడ్జిపై ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రాయదుర్గం పట్టణానికి చెందిన ఓబులేసు, తన భార్య, ఇద్దరు పిల్లలతో కలసి అనంతపురానికి కారులో వచ్చారు. ఆస్పత్రికి చేరుకునేందుకు రాంనగర్ మీదుగా అంబేడ్కర్ బ్రిడ్జిపై వెళ్తూ ఏసీ ఆన్ చేశారు. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. అప్రమత్తమైన దంపతులు వెంటనే పిల్లలను తీసుకుని కారు దిగారు. దగ్గర్లో ఉన్న ఫైర్ సిబ్బంది గమనించి అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. అప్పటికే కారులో ఉన్న సీట్లు దగ్ధమయ్యాయి.

మహిళను మోసం చేసి రూ.20 వేలు విత్‌డ్రా



నగదు డ్రా చేసుకెళ్లిన వ్యక్తి (వృత్తంలో)

ధర్మవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో సోమవారం ఓ మహిళను దుండగుడు మోసగించి రూ.20వేలు నగదు విత్‌డ్రా చేసుకున్నాడు. తొలుత ఏటీఎంలో నగదు డ్రా చేసుకునేందుకు వచ్చిన మహిళను మాటలతో ఏమార్చి ఆమె వెళ్లిపోయిన తర్వాత నగదు అపహరించినట్లుగా సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమైంది. ఘటనపై పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది.

కవితోత్సవానికి పేర్లు నమోదు చేసుకోండి

పెనుకొండ: ధర్మవరం వేదికగా డిసెంబర్ 1న ఉదయం పది గంటలకు జరిగే కవితోత్సవానికి పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా సోమవారం పిలుపునిచ్చారు. ధర్మవరం నియోజకవర్గ రచయితల సంఘం అధ్యక్షుడు జయసింహ, ప్రధాన కార్యదర్శి సత్యనిర్ధారణ్ తదితరుల నేతృత్వంలో జరిగే ఈ కవితోత్సవంలో చేనేత కష్టాలపై, వృద్ధాప్య జీవన అంశంపై 20 లైన్లకు మించకుండా కవితలు, పాటలు రాసి వినిపించవచ్చునన్నారు. ఆసక్తి ఉన్న వారు 94409 29894, 94940 18465లో సంప్రదించాలని సూచించారు.

జూదరుల అరెస్ట్

గోరంట్ల: మండలంలోని వెంకటరమణపల్లి సమీపంలో సోమవారం పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. వారి నుంచి రూ. 1,29,160 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

శ్మశాన వాటికలో గుర్తు తెలియని మృతదేహం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని జామీయ మసీదు రహదారి పక్కనే ఉన్న శ్మశాన వాటికలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. వేర్వేరుగా పడి ఉన్న మృతుడి శరీర భాగాలను కుక్కలు పీక్కుతిన్నాయి. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

క్రీడలతో మానసికోల్లాసం



గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్ ప్రభుకుమార్

బుక్కరాయసముద్రం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ ప్రభుకుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో 3వ క్రీడా మహోత్సవ్–2024 ప్రారంభించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ప్రభుకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు రోజూ యోగా, వ్యాయామం చేయాలన్నారు. ఏటా స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడలు మనస్సుకు ఉత్తేజాన్నిస్తాయన్నారు. బెటాలియన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, పోలీసు సిబ్బంది సహకరించాలన్నారు. సిబ్బందికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కేశవరెడ్డి, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఆర్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఆయుర్వేదిక్ కేంద్రాల మూసివేత

అనంతపురం: నగరంలో ఉన్న ఆయుర్వేదిక్ మందుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ డీఎస్పీ ఎం. నాగభూషణం, సీఐ కే. శ్రీనివాసులు, ఏఓ జే. వాసు ప్రకాష్, అసిస్టెంట్ డైరెక్టర్ (డ్రగ్స్) రమేష్ రెడ్డి దాడుల్లో పాల్గొన్నారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న కమలా నగర్‌లోని మెహతా ఆయుర్వేద కేంద్రం, రామచంద్ర నగర్ మెయిన్ రోడ్‌లోని సుశ్రుత ఆయుర్వేద హాస్పిటల్, అరవింద నగర్‌లోని కేరళ ఆయుర్వేదం, సాయి నగర్‌లోని ధన్వంతరి మల్టీ స్పెషాలిటీ అండ్ ఆయుర్వేదిక్ హాస్పిటల్‌ను మూసివేశారు. చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి నివేదిక పంపినట్లు ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. మొత్తం 6 ఆయుర్వేదిక్ షాపుల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించగా, నాలుగు షాపులను మూసివేసినట్లు పేర్కొన్నారు.

నర్స్ అదృశ్యం

అనంతపురం: నగరంలోని ఆనంద్ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్న జి.మేఘన (24) అదృశ్యమైనట్లు త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. మేఘన భర్త జి.హరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండలం తిప్పేపల్లి గ్రామానికి చెందిన జి.నరసింహులు కుమారుడు జి.హరి అనంతపురం నగరంలోని షిరిడీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. హరి వృత్తిరీత్యా డ్రైవర్ కావడంతో విధులకు వెళ్లారు. మేఘన ఇటీవలే ఆసుపత్రిలో నర్సుగా జాయిన్ అయ్యారు. ఆదివారం ఆరోగ్యం సరిగా లేదని ఇంటికి వెళ్తున్నట్లు తోటి సిబ్బందికి చెప్పి వెళ్లిన మేఘన.. ఇంటికి వెళ్లకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సాఫ్ట్‌బాల్ టోర్నీ విజేత ‘విజయనగరం’







విజేత ట్రోఫీని అందుకుంటున్న విజయనగరం క్రీడాకారులు, వైఎస్సార్ జిల్లా జట్టుకు రన్నరప్ ట్రోఫీని ప్రదానం చేస్తున్న దృశ్యం, మూడో స్థానంలో నిలిచిన అనంతపురం జట్టు

వజ్రకరూరు: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ టోర్నీ విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామ జెడ్పీహెచ్‌ఎస్ వేదికగా అండర్ 17 ఎస్‌జీఎఫ్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉత్కంఠగా సాగాయి. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన క్రీడా జట్లు పాల్గొనగా సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వైఎస్సార్ జిల్లా జట్టుపై విజయనగరం జట్టు గెలుపొంది విజేత ట్రోఫీని కైవసం చేసుకుంది. రెండో స్థానంలో వైఎస్సార్ జిల్లా, మూడో స్థానంలో అనంతపురం జిల్లా జట్లు నిలిచాయి. విజేత జట్లను అభినందిస్తూ ట్రోఫీలు, పతకాలను డీవైఈఓ శ్రీదేవి ప్రదానం చేశారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని క్రీడాకారులకు ఆమె పిలుపునిచ్చారు. జాతీయ జట్టులో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేయగా, ఇందులో కొనకొండ్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి సాయి కార్తీక్‌కు చోటు దక్కడంపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టోర్నీ అబ్జర్వర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎసత్యసాయి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మోరా ర్జీయాదవ్, సర్పంచ్ ఇందిరమ్మ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సురేష్, పలువురు పీఈటీలు పాల్గొన్నారు. కాగా, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.